క్లుప్తంగా

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. గురువారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌లు, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు, మద్యం, సారా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులు చూపించాలన్నారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ బాలయ్య, చక్రవర్తి, రంజిత్‌కుమార్, ఎస్‌ఎస్‌టీం తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



సాదిక్ పాషా(ఫైల్)

మానవపాడు: మద్యం మత్తులో క్షణికావేశానికి లోనై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన సాదిక్ పాషా(26)కూలీ పనులకు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 19న మద్యం తాగి ఇంటికొచ్చాడు. అన్నం పెట్టమని తల్లిని అడిగాడు. అన్నంలేకపోవడంతో వండి పెడతానని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. ఈ క్రమంలో క్షణికావేశానికి గురైనా అతను ఇంట్లో రంగుల్లో కలిపే టిన్నర్ కెమికల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన తల్లి చుట్టుపక్కల వారు వెంటనే అతన్ని కర్నూల్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

భర్త మందలించాడని మహిళ..

గద్వాల క్రైం: భర్త మందలించాడని భార్య పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాల మండలంలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ పర్వతాలు కథనం మేరకు.. జిల్లాడబండ గ్రామానికి చెందిన అనంతమ్మ(48)ను కూలీ పనులు చేయాలని భర్త కృష్ణ ఈ నెల 22న మందలించాడు. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను గద్వాల జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించి మృతి చెందింది. అనంతమ్మ తమ్ముడు పరశురాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం పట్టివేత

రాజోళి: మండలంలోని పెద్ద తాండ్రపాడుకు చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం పెద్ద తాండ్రపాడుకు చెందిన కుమార్ రూ.13 వేల విలువైన మద్యాన్ని కొనుగోలు చేసి, తన కూల్‌డ్రింక్ షాపులో విక్రయించేందుకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు సమాచారం రావడంతో అతన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని వేముల గ్రామానికి చెందిన ఆంజనేయులు పాగాకు కంపెనీ నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా, మునుగాల శివారులో పోలీసులు తనిఖీ చేసి 21 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.23,760 వరకు ఉంటుందని, మద్యాన్ని పీఎస్‌కు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోళి: మండలంలోని తుమ్మిళ్ల గ్రామం తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుమ్మిళ్ల నుంచి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పెద్ద తాండ్రపాడు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వెంటనే స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ బోయ వెంకట్రాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

గద్వాల క్రైం: వనపర్తి జిల్లా జానంపల్లి గ్రామానికి చెందిన రాంరెడ్డి రెండు రోజుల క్రితం గద్వాల జములమ్మ ఆలయానికి వచ్చి కనిపించకుండా పోయాడు. ఇప్పటి వరకు ఎలాంటి ఆచూకీ లేక పోవడంతో గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి జములమ్మకు మొక్కు తీర్చుకునేందుకు వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులంతా సిద్ధమయ్యారు. ఆ సమయంలో రాంరెడ్డి కన్పించలేదు. దీంతో స్వగ్రామానికి వెళ్లి ఉండొచ్చని వెళ్లిపోయారు. గ్రామానికి సైతం రాకపోవడం, తెలిసిన బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేదు. దీంతో గురువారం కుమారుడు రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు ఊరట

- ఏప్రిల్ నుంచి పెరిగిన కూలీ భత్యం
- రూ.272 నుంచి రూ.300 వరకు పెంపు
- వేసవిలో అదనంగా రూ.28 పెంచిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

ఆయా మండలాల వారీగా కూలీల వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కూలీలు
ఇటిక్యాల	17062	39194
మానవపాడు	10865	22133
ఉండవెల్లి	10254	21684
అలంపూర్	9293	19033
రాజోళి	10684	23744
వడ్డేపల్లి	6329	13557
అయిజ	17475	40927



ధర్మవరంలో కాల్వ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా ఉపాధి కూలీల భత్యాన్ని ఏప్రిల్ 1 నుంచి పెంచేలా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంత వరకు కూలీలకు గరిష్టంగా రోజు వారీ కూలీ రూ.272 చెల్లిస్తుండగా, ఇక నుంచి రూ.28 కలిపి రూ.300 అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో 124 పంచాయతీలున్నాయి. అందుల్లో 81,962 మందికి జాబుకార్డులు ఉండగా, 1,80,272 మంది కూలీలు నిత్యం పనులకు హాజరవుతున్నారు. ప్రతి కుటుంబానికి పని కల్పించే విధానం ఏర్పాటు చేయడంతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. వేసవిలో కూలీల భత్యాన్ని పెంచడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెరుగుతున్నాయి..



రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. ఉపాధి హామీ పనిచేస్తే అప్పట్లో కూలీ డబ్బులు సక్రమంగా వచ్చేవి కావు. ప్రస్తుతం కూలీ డబ్బులు నెలలోగా నేరుగా కూలీల ఖాతాలో జమ అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూలీ పెంచడంతో మాకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. కూలీ డబ్బులు త్వరగా వచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– బాబురెడ్డి, ఉపాధి కూలీ, సాసనూలు

సద్వినియోగం చేసుకోవాలి..



గ్రామాలలోని కూలీలందరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ పథకంలో నిత్యం కూలీకి ఏప్రిల్ 1 నుంచి అదనంగా రూ.28 పెరిగింది. కూలీలు ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలి. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎండలకు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ, ఇటిక్యాల

తక్కువ బరువున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రోగ్రాం అధికారులు

మల్దకల్: తక్కువ బరువున్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రోగ్రాం అధికారులు నర్సింగరావు, ప్రముఖ్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గురువారం మండలంలోని అమరవాయిలోని అంగన్‌వాడీ కేంద్రాలను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎత్తు, బరువు తక్కువ ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అలాగే గర్భిణి, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయడంతో పాటుగా వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తను ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణ్ రెడ్డి, సీడీపీఓ కమలాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, పద్మమ్మ, మహిళలు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,624

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 177 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6624, కనిష్టం రూ.4080, సరాసరి రూ. 6636 ధరలు పలికాయి. 12 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5491, కనిష్టం రూ. 3020, సరాసరి రూ. 5640 ధరలు వచ్చాయి. 4 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.10,066, కనిష్టం రూ.10,016 , సరాసరి రూ.10,066 ధరలు పలికాయి. 2450 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2482, కనిష్టం రూ.1,519, సరాసరి ధర రూ.2,019 ధరలు వచ్చాయి. 23 క్వింటాళ్ళ వరి (హంస) రాగా గరిష్ట, కనిష్టం, సరాసరి ధర రూ. 1510 పలికింది.

ఇంటింటి ప్రచారం

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం గ్రామంలోని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. ఆర్‌ఎస్పీని ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్‌గౌడు, మాజీ ఎంపీటీసీ కృష్ణ, జానీబాషా, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రమణ, రఘు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

అయిజ: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిద్దామని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి ఆయా గ్రామాల తాగునీటి సమస్య గురించి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో తాగునీటి వనరులు, వాటిని ఉపయోగించుకోవడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. మిషన్ భగీరథ నీరు తగ్గిపోయిందని, దాని వల్ల ఇంటింటికి కుళాయి ద్వారా నీటిసరఫరా కష్టమవుతోందని, చేతిపంపులను మరమ్మతులు చేసి వాటి నుంచి నీటిని తోడుకోవాలని ఎంపీడీఓ పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హర్షద్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు

గద్వాల అర్బన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈవీఎం మిషన్లు, ఎన్నికల సామగ్రి ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తరగతులను ఈనెల 26నుంచి మే 13వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి విద్యార్థినులు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరు కావాలని పేర్కొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన



సంగాల చెరువు వద్ద చేపల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీఎస్సీ లైఫ్‌సైన్స్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం మండలంలోని సంగాల చెరువులో చేపల పెంపకంపై ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లి చేపల పెంపక, వాటి నిర్వాహణపై విద్యార్థులకు వివరించారు. చెరువులో లభించే వివిధ రకాల చేపల పెంపకం, చేపల రకాలు, వాటికి అందించే ఆహారం, చేపలు పట్టే వలలు, పడవలు, చెరువు నిర్వాహణ, చెరువు భౌతిక, రసాయనిక అంశాలు, నీటిలో లభించే వృక్ష జంతు ప్లవకాలు, స్థానికంగా లభించే చేపల రకాలైన కట్ల చేప, రోహో చేప, పిల్లి చేప, బంగారు తీగలు, కొర్రమీను తదితర చేపలను ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జువాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులను ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరమ్మ, హరినాథ్, ఎల్లస్వామి, కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌ను నిర్మించుకోవాలి



గద్వాల అర్బన్: రాష్ట్రంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో సీటును సంపాదించి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ఎంఏ ఇంగ్లిష్ ఎంట్రెన్స్ టెస్టుకు సంబంధించి ఉచిత కోచింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు కృష్ణమూర్తి, మల్లికార్జున్, లలిత, పరశురాముడు, కుమారస్వామి ఉన్నారు.

నేడు కొర్విపాడులో కమ్యూనిటీ ప్రోగ్రామ్

మానవపాడు: జిల్లా ఎస్పీ ఆదేశానుసారం మండలంలోని కొర్విపాడు గ్రామంలో ఈ నెల 26వ తేదీన కమ్యూనిటీద ప్రోగ్రామ్ నిర్వహి స్తామని గురువారం ఓ ప్రకటనలో ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

రాజోళి: మలేరియా నిర్మూలన కోసం ప్రజలు, వైద్య సిబ్బందితో కలిసి కట్టుగా కృషి చేయాలని డాక్టర్ మధుబాబు అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. 2030 నాటికల్లా మలేరియా రహిత గ్రామాలను చూసేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రాజోళి వీధుల్లో ర్యాలీ తీశారు. ప్రతి ఒక్కరు వైద్యుల సలహాలు పాటిస్తే మలేరియానే కాకుండా మరెన్నో రోగాలు దరి చేరకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్,హెచ్‌ఈఓ రామకృష్ణ, లెప్రసీ నోడల్ పర్సన్ రంజిత్ కుమార్, స్టాఫ్ నర్సులు జమున, ఏఎన్‌ఎం మద్దమ్మ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి, వైద్య సిబ్బంది లక్ష్మీకాంత్, బాలీశ్వరయ్య, అక్కమ్మ, లీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మేడికొండ అభ్యర్థి నామినేషన్

అయిజ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా వీసీకే (విముక్త చి రుతల కక్షి) పార్టీ నుంచి మేడికొండ గ్రామానికి చెందిన దాసరి భారతి గురువారం రిటర్నింగ్ ఆఫీసర్ ఉదయ్ కుమార్‌కు రెండో సెట్టు నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మున్సిపల్ చైర్మన్

గద్వాల అర్బన్: కేటీదొడ్డి మండలం సుల్తాన్‌పురం గ్రామానికి గౌడ కల్లుగీత కార్మికులు, మల్దకల్ మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, వెంకట్రామిరెడ్డి, శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, గోపాల్, శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన స్రవంతిని గురువారం బీసీ సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించా రు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో బల్గెరకు చెందిన సుచిత్ర, శ్రీనివాసులు దంపతుల కుమార్తె స్రవంతి మొదటి సంవత్సరంలో మంచి మా ర్కులు సాధించడంతో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టె మహేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న ఘనంగా సన్మానించి అభినందించారు.

ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన



మాచర్లలో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరంలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ఐకేపీ, వీఓఏల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏ అధికారి నాయుడు, మహిళా సంఘం లీడర్లు జయంతి, కళావతి, లక్ష్మీ, సత్యవతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లన్న పాల్గొన్నారు.



సాతర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్

పోలింగ్ కేంద్రాలను పరిశీలన..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం, సాతర్ల, వావిలాల గ్రామ పంచాయతీలను గురువారం తహసీల్దార్ నరేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తాగు నీరు, విద్యుత్, తదితర వసతులను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ, జీపీ కార్యదర్శులు, బీఎల్వోలు, తదితరులు ఉన్నారు.



భీమవరంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న వీఓఏ అధికారి నాయుడు

ఓటు వినియోగంతోనే భవితకు బాట

రాజోళి: ఓటు హక్కును వినియోగించుకోవడం వల్ల రేపటి తరం పిల్లల భవితకు బాట వేయడంతో పాటు నేటి తరానికి ప్రజాస్వామ్య విలువలు తెలిపిన వారిమవుతామని ఏపీఎం మార్తమ్మ అన్నారు. మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పొందిన ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఓటు వినియోగించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ మద్దిలేటి, వీఏఓలు సుధీర్, రాజు, హనుమంతు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో ఓటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకూడదు

గట్టు: ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని మాచర్ల గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘం మహిళలు ప్రతిజ్ఞ చేశారు. మాచర్లలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకుంటామని మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీ శివ, వీఓఏలు జమ్మన్న, ప్రకాష్, గ్రామ సంఘం అధ్యక్షుడు, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఉపాధి కూలీలతో ఓటు హక్కుపై డీపీఎం విలాస్‌రావ్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మే 13న ఓటును సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ మహిళలే ఓటును ప్రత్యేకంగా ఉపయోగించుకోవాలని, ఇంట్లో పనినే కాదు, బయట ఓటును కూడా ఉపయోగించుకుని ఓటుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కోటేశ్వరి, ఉపాధి కూలీలు, టీఏలు, పాల్గొన్నారు.

ఎండలో ఓటుహక్కుపై ప్రచారం

మండల కేంద్రంలోని ఉపాధి కూలీలు మండుటెండలో పనులు చేస్తుండగా ఓటుహక్కుపై అధికారులు నిలబెట్టి ప్రమాణాలు చేయిస్తున్నారు. రాజకీయ మీటింగ్‌లు ఎండలోనే, అధికారుల మీటింగ్‌లు ఎండలోనే నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల అధికారిని ఉపాధి కూలీలతో ప్రమాణం చేయిస్తున్నారు. దీంతో కొందరు ఉపాధి కూలీలు తలపై చీర కొంగును వేసుకుని ఎండలో ఉండిపోయారు. ఎండలకు మీటింగ్‌లు వినలేక విసుగు చెందుతున్నట్లు పలువురు ఉపాధి కూలీలు పేర్కొంటున్నారు. అధికారులను ఎండలు లేని సమయంలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు వ్యతిరేకించాలి



ఆరగిద్దలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

గట్టు: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఎస్‌ఐ రామకృష్ణ కోరారు. గురువారం రాత్రి ఆరగిద్ద గ్రామంలో పోలీసులు సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వరాదన్నారు. మహిళలు, బాలికలపై జరిగే అత్యాచారాలు, దాడులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. గ్రామాల్లో అపరిచితుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడకుండా, పెద్ద మనుషుల సమక్షంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదని, వాటికి భంగం కల్గించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేయరాదని, ఇతర మతాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలపై అధికారుల వివక్ష తగదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని 100 రోజుల ఉపాధి కూలీలకు కొంత మందిని పంపించి, మరి కొందరిపై అధికారులు వివక్ష చూపిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపల్లె దేవదాసు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని, ఎందుకు సగం మందిని పనులకు పంపించి మిగితా వారిని ఇంటికి పరిమితం చేస్తున్నారని అన్నారు. అధికారులు వివక్ష చూపుతున్నారని టీఏ రామచంద్రుడును అడగడంతో కూలీలతో దరఖాస్తులు అందజేశారు. ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్‌తో ఫోన్లో మాట్లాడారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధి కూలీలు, నాగన్న, లక్ష్మీదేవి, మాణిక్యమ్మ, రాజేశ్వరి, మహేశ్వరి పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో టీఏకు దరఖాస్తులు అందజేస్తున్న ఉపాధి కూలీలు

అక్షింతలు మనకిచ్చి ఓట్లడుగుతున్న బీజేపీ

- ప్రచారంలో మంత్రి జూపల్లి

ఉండవెల్లి: దేశంలో బీజేపీ రాముడి గురించి చెప్పి, అక్షింతలు మనకిచ్చి ఓట్లడుగుతున్న పరిస్థితి నెలకొందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా మండల కేంద్రంలో వీఆర్ కాలనీ నుంచి రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో మంత్రి మాట్లాడుతూ ఆనాడు ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచిస్తే, ఈనాడు బీజేపీ ప్రభుత్వం మారుస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు డబుల్ బెడ్రూంలు ఇస్తామని, ఇవ్వలేదన్నారు.70 ఏళ్లు కాంగ్రెస్, టీడీపీలు పరిపాలన చేస్తే ఈ రాష్ట్ర అప్పు రూ.70 వేల కోట్లు ఉంటే, పదేళ్లు పాలించిన కేసీఆర్ రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. కేసీఆర్ చేసిన అప్పుకు ఏడాదికి రూ.65 వేల కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తుమ్మిళ్ల రిజర్వాయర్ ద్వారా 81 వేల ఎకరాలకు చివరి డిస్ట్రిబ్యూటర్ వరకు నీరు రావాలన్నారు. బీజేపీని, బీఆర్‌ఎస్‌ను పక్కన పెట్టి మల్లు రవి అందరికంటే సీనియర్ నాయకుడని, రెండు సార్లు ఎంపీగా చేసిన అనుభవం ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ సరిత, సంపత్ కుమార్, అభ్యర్థి మల్లు రవి మాట్లాడారు. మతం గురించి మాట్లాడుతున్న బీజేపీ, మత సమరస్యానికి దేశం అనుకూలంగా ఉన్న సమయంలో రాముడి పేరు చెప్పుకుని రాజకీయాలు చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్క చిత్రంలో ఎంపీ అభ్యర్థి మల్లు రవి